
# నేడు గజ్వేల్‌కు గులాబీ దళపతి

- నేడు గజ్వేల్‌లో ప్రజా ఆశీర్వాద సభ
- హాజరుకానున్న సీఎం కేసీఆర్
- ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్ఎస్ నేతలు
- సభను విజయవంతం చేయాలి
- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్‌లో సీఎం సభకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, నవంబర్ 27: మూడోసారి గజ్వేల్ ఎమ్మెల్యేగా సీఎం కేసీఆర్ లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని, ప్రతి పక్షపార్టీల నాయకులు ఎన్నికలప్పుడే కనిపిస్తారని తర్వాత గజ్వేల్‌లో కనిపించరని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ నిర్వహించనుండగా సోమవారం గజ్వేల్ పట్టణంలో సీఎం కేసీఆర్ బహిరంగ సభాస్థలి, హెలిప్యాడ్ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్, బీజేపీ నాయకులు డిపాజిట్ల కోసమే తాపత్రయపడుతున్నారన్నారు. గజ్వేల్‌లో చేపట్టిన అభివృద్ధితో 50 ఏండ్లు ముందుకు పోయిందని, ముఖ్యంగా తాగు, సాగునీరు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్మించి కూడవెల్లి, హల్దీప్రాజెక్టులను నిర్మించడంతో ఈ ప్రాంతం సస్యశామలమైందన్నారు. రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించి రైతుబంధు, రైతు బీమా అందించిన ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమేనని గుర్తుచేశారు. అన్ని వర్గాల వారు కేసీఆర్ పక్షానే ఉన్నారని, గ్రామీణ ప్రాంత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారని, గొర్రెలు, చేపల పంపిణీ చేసి ఆర్థికంగా ఎదిగే విధంగా చేశారన్నారు. రైతులకు 24గంటల పాటు కరెంట్ ఇచ్చారని పండించిన పంటలను కొనుగోలు చేస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారుసులను అమలు చేశారని, గజ్వేల్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం, అటవీ కళాశాల, ఎడ్యుకేషన్ హబ్ నిర్మించారన్నారు. గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి తెలంగాణ వ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చామన్నారు. కాంగ్రెస్ హయాంలో రోడ్లపైకి వచ్చి ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు చేసేవారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ జీతాల కంటే అధికంగా ఇస్తూ వారిని కాపాడుకుంటున్నామన్నారు. నేడు ఏ గ్రామంలోకి వెళ్లినా ధాన్యం రాశులు కనిపిస్తున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కనీసం కరెంట్, తాగు నీరు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇంటింటికీ తాగునీరు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామన్నారు. హరితహారంలో విరివిగా మొక్కలు పెంచామన్నారు. ప్రజలు కేసీఆర్‌తోనే ఉన్నారు కాబట్టే తెలంగాణ సాధించుకున్నామన్నారు. రాష్ట్రంలో 85స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నేడు మధ్యాహ్నం రెండు గంటలకు లక్షమందితో సీఎం కేసీఆర్ సభనిర్వహిస్తున్నామని, అందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు కిషన్‌రెడ్డి, మల్లేశం, హనుమంత్, భూపాల్‌రెడ్డి, అహ్మద్ పాల్గొన్నారు.



గజ్వేల్‌లో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎన్నికల ఇన్‌చార్జి పాతూరి సుధాకర్‌రెడ్డి



గజ్వేల్‌లో మ్యాపును పరిశీలిస్తున్న సీపీ శ్వేత

**సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన**

గజ్వేల్/ గజ్వేల్‌అర్బన్, నవంబర్ 27: గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ మార్గంలోని ఐవోసీ భవనం వెనుక మంగళవారం నిర్వహించే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణం, హెలీప్యాడ్ ప్రదేశాలను సోమవారం సాయంత్రం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఎన్నికల ఇన్‌చార్జి పాతూరి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మికిషన్‌రెడ్డి, శ్యామలా మల్లేశం పరిశీలించారు. డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు మడుపు భూంరెడ్డి, భూపతిరెడ్డి, నాయకులు దుర్గయ్య, హైదర్‌పటేల్ ఉన్నారు.

**సీఎం కేసీఆర్ సభాస్థలి వద్ద పటిష్ట బందోబస్తు**

గజ్వేల్, నవంబర్ 27: గజ్వేల్ పట్టణంలో నేడు నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ శ్వేత తెలిపారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని కోలా అభిరాం గార్డెన్స్‌లో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని, సభకు వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు విధి నిర్వహణలో ఉన్న పోలీస్ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వాహనాల కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలుపుకోవాలన్నారు. బందోబస్తులో అడిషినల్ డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో ఆరు సెక్టార్లుగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు, ఏసీపీలు రమేశ్, సతీశ్, సురేందర్‌రెడ్డి, రవీందర్‌రాజు, ప్రసన్నకుమార్, శ్రీనివాస్, సీఐలు జాన్‌రెడ్డి, జానకీరామ్, రంగ కృష్ణ, రఘుపతిరెడ్డి, తిరపతి పాల్గొన్నారు.

# పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్**




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఈఓ వికాస్‌రాజ్

సిద్దిపేట అర్బన్, నవంబర్ 27: ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు, ముఖ్య ఎన్నికల అధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఈఓ వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్‌లో భాగస్వామ్యం చేసేలా ఆ సందేశం స్పష్టంగా తెలిసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రచార సమయం నేడు సాయంత్రం నాలుగు గంటలకు ముగుస్తుందని.. అనంతరం 48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ పాటించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు , అభ్యర్థులకు సమాచారం అందించాలని.. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు వెళ్లేలా చూడాలన్నారు. పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని.. విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలన్నారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎం యంత్రాల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని.. జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, సిద్దిపేట రిటర్నింగ్ అధికారి రమేశ్‌బాబు, ఎలక్షన్స్ సూపరిండెంట్ రామేశ్వర్, ఎలక్షన్ డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.




మిరుదొడ్డి: కొండాపూర్ ప్రచారంలో మాట్లాడుతున్న పృథ్వీకృష్ణారెడ్డి

# కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే కష్టాలే

**మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్**

మిరుదొడ్డి, నవంబర్ 27: రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ లేదని గ్రహించిన ప్రధాని మోదీ సీఎం కేసీఆర్ రైతులకు వేసే రైతుబంధు డబ్బులను ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి నిలుపుదల చేశారని మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్ ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా సోమవారం మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల, అందె, కొండాపూర్, చెప్యాల, లింగుపల్లి, మల్లుపల్లి గ్రామాల్లో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తనయుడు కొత్త పృథ్వీకృష్ణారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటేసి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**తొమ్మిదేండ్లలో ఎంతో అభివృద్ధి, సంక్షేమం**

50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు చేసింది శూన్యమని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తనయుడు కొత్త పృథ్వీరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. మూడేండ్ల కిందట రఘునందన్ రావు ఉప ఎన్నికల్లో గెలిచి దుబ్బాకలో ఒక్క పని కూడా చేయలేదని ఆరోపించారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల సాయిలు, జడ్పీటీసీ సూకురి లక్ష్మిలింగం, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, సర్పంచ్‌లు ఎనగంటి కిష్టయ్య, చుక్క శంకర్, పెద్ది కవితారాజు, జోగ్గారి బాల్‌నర్సు, సిద్ది భారతి భూపతిగౌడ్, మాచపురం లక్ష్మీయాదగిరి, వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, ఎంపీటీసీలు లలితా సత్యం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు సత్యనారాయణ, నంట బాపురెడ్డి, నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, సుధీర్, మల్లేశం, మల్లారెడ్డి, రవీదర్‌రెడ్డి, బాబు, శివ, దిలీప్‌రెడ్డి, రాజయ్య, లక్ష్మణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.